సాక్షి
కుమురం భీం
బుధవారం । 13 । నవంబర్ । 2024

వైభవంగా మహాపాదయాత్ర

శ్రీసిద్ధి టోంకిని హనుమాన్ 23వ మహాపాద యాత్ర మంగళవారం వైభవంగా సాగింది. వేకువజాము నుంచే భక్తులు పాదయాత్రగా టోంకిని గ్రామానికి చేరుకుని హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. హనుమాన్, శ్రీరాముడి నామస్మరణ చేస్తూ కాలినడకన వెళ్తున్న భక్తులతో రహదారులు సందడిగా మారాయి.

- వివరాలు 9లో▸



న్యూస్‌రీల్

కలెక్టర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్‌: వికారాబాద్‌ జిల్లా దుద్యాల మండలంలో భూసేకరణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్‌తోపాటు రెవెన్యూ అధికారులపై దాడికి పాల్పడిన వారిపై కఠినంగా శిక్షించాలని ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్‌ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రభుత్వ శాఖల ఉద్యోగులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ విధినిర్వహణలో ఉన్న కలెక్టర్‌, ఉద్యోగులపై దాడికి పాల్పడటం శోచనీయమన్నారు. ఉద్యోగుల మనోధైర్యం దెబ్బతినకుండా ప్రభుత్వ తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ల సంఘం జిల్లా నాయకులు మధుకర్‌, ప్రమోద్‌, డీఎల్‌పీవో ఉమర్‌ హుస్సేన్‌, పంచాయతీరాజ్‌, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లాలో చివరి గింజ వరకు వరిధాన్యం కొనుగోలు చేస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్‌ నరసింహారావు, జిల్లా సహకార ఆడిట్‌ అధికారి రబ్బానీ మంగళవారం ఉమ్మడి ప్రకటనలో తెలిపారు. కలెక్టర్‌ ఆదేశాలతో జిల్లాలో 34 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, వీటిలో 21 ప్రాథమిక సహకార సంఘాలు, 13 మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం నాలుగు వేల మెట్రిక్‌ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఇతర జిల్లాలతో పోలిస్తే కుమురంభీం ఆసిఫాబాద్‌లో పంట కొంత ఆలస్యంగా వస్తుందన్నారు. ఇప్పుడే పంట కోతకు వచ్చిందని, చేతికి రావడానికి మరో 15 రోజులు పట్టే అవకాశం ఉందని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కేంద్రాలకు పంట తెచ్చే సమయంలో 17శాతం మాత్రమే తేమ ఉండేలా చూసుకోవాలని సూచించారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు

సాక్షి ఎఫెక్ట్

దహెగాం/కౌటాల: సాక్షి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన 'అమ్మకానికి తంటాలు..!' అనే కథనానికి కాగజ్‌నగర్‌ మార్కెట్‌ కమిటీ అధికారులు స్పందించారు. కాగజ్‌నగర్‌ మార్కెట్‌ కమిటీ పరిధిలోని కౌటాలలోని వైష్ణవి మాత కాటన్‌ ఇండస్ట్రీ, సిర్పూర్‌(టి)లోని శ్రీరామా జిన్నింగ్‌ మిల్లుల్లో బుధవారం నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు కాగజ్‌నగర్‌ మార్కెట్‌ కార్యదర్శి భాస్కర్‌ తెలిపారు. ఉదయం 10 గంటలకు పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తామన్నారు. రైతులు పత్తి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దివ్యాంగుల పాఠశాలలకు రిజిస్ట్రేషన్‌ తప్పనిసరి

ఆసిఫాబాద్‌: జిల్లాలో దివ్యాంగుల సంక్షేమం కోసం నిర్వహించే ఆశ్రమాలు, పాఠశాలలు, వివిధ సంస్థలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా ఆశ్రమాలు, సంస్థలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దివ్యాంగుల సంక్షేమ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్‌ కోసం ఈ నెల 14లోగా జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 15 తర్వాత రిజిస్ట్రేషన్‌ లేని సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పూర్తి వివరాలకు టోల్‌ఫ్రీ నంబర్‌ 155326 సంప్రదించాలని కోరారు.

స్పష్టంగా వివరాలు నమోదు చేయాలి



సర్వే పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్‌

ఆసిఫాబాద్‌/వాంకిడి: సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా తప్పులు లేకుండా స్పష్టంగా వివరాలు నమోదు చేయాలని అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి అన్నారు. వాంకిడి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సర్వేను మంగళవారం పరిశీలించారు. తహసీల్దార్‌ రియాజ్‌ అలీ, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌, ఎంపీవో ఖాజా అజీజుద్దీన్‌ ఉన్నారు. నాలుగో రోజు మంగళవారం జిల్లాలో 11,537 కుటుంబాల సర్వే పూర్తి చేశారు. ఇప్పటివరకు 34,730 కుటుంబాల సర్వే పూర్తయింది.

గుర్తింపు కోసం ఆరాటం

- సిర్పూర్‌ నియోజకవర్గంలో 30వేలకు పైగా బెంగాలీల జనాభా
- 17 గ్రామాల్లో నివాసం
- కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయని అధికారులు
- సమగ్ర సర్వే జాబితాలోనూ వివరాల నమోదుకు ఇబ్బందులు
- సమస్యకు పరిష్కారం చూపాలని వినతి



చింతలమానెపల్లి మండలం రవీంద్రనగర్‌లో సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్‌

చింతలమానెపల్లి(సిర్పూర్‌): రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. దీంతో మళ్లీ సిర్పూర్‌ నియోజకవర్గంలోని బెంగాలీల కుల గుర్తింపు ప్రస్తావన తెరపైకి వచ్చింది. ఇప్పటికీ కుల గుర్తింపు లేని కారణంగా బెంగాలీలు ఓసీలుగా మాత్రమే ఉనికిలో ఉన్నారు. సర్వే నేపథ్యంలో తమ గొంతు వినిపించేందుకు వారు సిద్ధమవుతున్నారు.

17 గ్రామాలు.. 30వేల జనాభా

భారతదేశం, పాకిస్తాన్‌ విభజన అనంతరం బంగ్లాదేశ్‌, పాకిస్తాన్‌ ప్రాంతాల్లోని హిందువులు ఇండియాకు రావాలని అప్పటి ప్రభుత్వం పిలుపునిచ్చింది. ఇలా దేశంలోకి బంగ్లాదేశ్‌లో ఉన్న హిందువులు తరలివచ్చారు. అప్పటి భారత ప్రధానిగా ఉన్న ఇందిరాగాంధీ వీరికి ఆశ్రయం కల్పించి వసతులు ఏర్పాటు చేసింది. సుమారుగా 1500 కిలోమీటర్ల దూరం ఉన్న బంగ్లాదేశ్‌లోని ఫరీదాబాద్‌, కుల్నా, జాసోర్‌ జిల్లాల నుంచి కాగజ్‌నగర్‌ ప్రాంతానికి హిందువులు తరలివచ్చారు. మొదట్లో శరణార్థులుగా వచ్చినా ప్రభుత్వం వీరికి భారత పౌరసత్వం ఇచ్చింది. స్థానికులతో కలిసిపోయిన వీరిని బెంగాలీలుగా పిలుస్తున్నారు. బంగ్లాదేశ్‌ నుంచి 1965లో రాగా కాగజ్‌నగర్‌ పట్టణ శివారు ప్రాంతంలో ప్రభుత్వం శిబిరాలు ఏర్పాటు చేసింది. ఈజ్‌గాం వద్ద నజ్రుల్‌నగర్‌ తదితర గ్రామాల పేరుతో మొత్తం 14 క్యాంపు(శిబిరాలు) ఏర్పాటు చేసింది. అనంతరం 1976లో అప్పటి కౌటాల మండలం(ప్రస్తుతం చింతలమానెపల్లి మండలం) బాబాపూర్‌ గ్రామం శివారులో రవీంద్రనగర్‌ పేరుతో రెండు గ్రామాలు, సిర్పూర్‌(టి) మండలం లక్ష్మీపూర్‌ వద్ద మరో మూడు గ్రామాలను ఏర్పాటు చేసింది. ఉపాధి కోసం కుటుంబానికి ఐదెకరాల భూమి, నివాసం కోసం 8 గుంటల చొప్పున భూమిని కేటాయించింది. ఏడాది పాటు రేషన్‌, ఇతర వస్తువులు కూడా ఉచితంగా సరఫరా చేసింది. ప్రస్తుతం మొత్తం 17 గ్రామాల్లో సుమారు 30వేల జనాభా ఉండగా 20వేల బెంగాలీ ఓటర్లు ఉన్నారు.

సర్వే జాబితాలో చోటేది..?

తాజాగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేలో అన్ని కులాలకు సంబంధించి జాబితా తయారు చేశారు. ఎన్యూమరేటర్‌ ప్రతీ వ్యక్తి లేదా కుటుంబ కులాన్ని కోడ్‌ రూపంలో నమోదు చేస్తున్నారు. అయితే బెంగాలీలకు సంబంధించి ప్రత్యేక జాబితా నమోదు కాలేదు. బెంగాలీల్లోనూ ప్రత్యేక కులాలు ఉన్నాయని వారు చెబుతున్నారు. గతంలో మంజూరైన ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాలను ఉదాహరణగా చూపుతున్నారు. సర్వే జాబితాలో బెంగాలీల ప్రస్తావన లేకపోవడంతో తామంతా ఓసీలుగా నమోదు చేసుకోవాల్సిందేనా అని ప్రశ్నిస్తున్నారు. తాజా సర్వేలో తమ అభిప్రాయాలు వెల్లడించేందుకు సిద్ధమవుతున్నారు. తమలో ఉన్న ఎస్సీ, బీసీ, ఓసీ కులాలను సర్వే సిబ్బంది తెలుపుతామని అంటున్నారు.

కుల గుర్తింపు కోసం పోరాటం

అప్పటి ప్రభుత్వం సరిహద్దు రశీదుల పేరిట వీరికి ఇచ్చిన పత్రాల్లో కులాలు నమోదు చేశారు. వీటి ఆధారంగా కులగుర్తింపు ఇచ్చారు. బెంగాలీలుగా ఉన్న వీరికి ఆయా కులాల అనుసారంగా గతంలో ప్రభుత్వం కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసింది. ఈ పత్రాలతోనే ఎన్నికల్లో పాల్గొనగా.. విద్యార్థులు ఉపకార వేతనాలు పొందారు. అనంతరం వీరికి కుల ధ్రువీకరణ ఇవ్వడం నిలిపివేశారు. తహసీల్దార్‌ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకున్నా కుల ధ్రువీకరణ, కమ్యూనిటీ పత్రాలు ఇవ్వడం లేదు. గతంలో రవీంద్రనగర్‌ సర్పంచ్‌గా పనిచేసిన పలువురు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలతో గెలుపొందారు. పదేళ్ల క్రితం స్థానిక సంస్థల ఎన్నికల్లో రవీంద్రనగర్‌ ఎంపీటీసీ స్థానాన్ని బీసీలకు కేటాయించగా గ్రామస్తులు ఆ ఎన్నికలు బహిష్కరించారు. స్థానికేతరులు సైతం పాల్గొనకుండా బెంగాలీలకు మద్దతు ప్రకటించారు. ఆర్మీలో సైనికులుగా పనిచేస్తున్న యువకులు సర్టిఫికెట్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ విన్నవించుకున్నారు. దివంగత రాష్ట్రపతి ప్రణబ్‌ ముఖర్జీ దృష్టికి సైతం తీసుకెళ్లారు. అన్ని పార్టీలూ మద్దతు తెలుపుతున్నా సమస్యకు పరిష్కారం లభించడం లేదు.

కులం వివరాలు అందిస్తాం



కుటుంబ సర్వేలో మాకు గతంలో ఇచ్చిన కుల ధ్రువీకరణ వివరాలు అందిస్తాం. జాబితాలో బెంగాలీల ప్రస్తావన లేదు. మాకు అధికారికంగా కుల గుర్తింపు ఇవ్వడం లేదు. సర్వేలో మా వివరాలు నమోదు చేయిస్తే ప్రభుత్వానికి ఇబ్బందులు తెలిపే అవకాశం ఉంటుంది.

– సమీర్‌ గుప్తా, ఈస్‌గాం, మం.కాగజ్‌నగర్‌

గుర్తింపు ఇవ్వాలి



కుల గుర్తింపు లేక ఇబ్బంది పడుతున్నాం. చదువుకున్నా మా పిల్లలకు ఉద్యోగాలు రావడం లేదు. ధ్రువీకరణ లేకపోతే భవిష్యత్తులోనూ ఇబ్బందులు పడాల్సిందే.. ఈ సర్వే ద్వారా ప్రభుత్వం మాపై దృష్టి సారించాలి.

– తపన్‌ మండల్‌, రవీంద్రనగర్‌, మం.చింతలమానెపల్లి

ఏళ్లుగా పోరాటం



గతంలో మాకు ఇచ్చిన కుల ధ్రువీకరణ నిలిపివేశారు. కుల ధ్రువీకరణ సాధనకు అనేక పోరాటాలు చేశాం. సర్వేలో బెంగాలీల కుల ప్రస్తావన లేదు. ఓసీలుగా నమోదు చేసినా కులం నమోదు చేసే అవకాశం లేదు. అధికారులు జోక్యం చేసుకోవాలి.

– గోపాల్‌ చంద్రరాయ్‌, రవీంద్రనగర్‌, మం.చింతలమానెపల్లి

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి



మాట్లాడుతున్న కె.సురేంద్ర మోహన్‌

ఆసిఫాబాద్‌: తప్పులు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని ఉమ్మడి జిల్లా ఓటరు జాబితా పరిశీలకుడు కె.సురేంద్ర మోహన్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ చాంబర్‌లో మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే, అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి, కాగజ్‌నగర్‌ సబ్‌ కలెక్టర్‌ శ్రద్ధా శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి ఎన్నికల అధికారులు, సహాయ ఓటరు నమోదు అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సురేంద్ర మోహన్‌ మాట్లాడుతూ పీవీటీజీ గ్రామాల్లో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కళాశాలల్లో అంబాసిడర్లను నియమించి ప్రచారం చేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల సాయం తీసుకోవాలని సూచించారు. కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే మాట్లాడుతూ ఈ నెల 28 వరకు ఓటరు నమోదు మార్పులు, సవరణలు, తొలగింపులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. తుది ఓటరు జాబితాను 2025 జనవరి 6న ప్రకటిస్తామని పేర్కొన్నారు.

జైనూర్‌ ఏఎంసీ చైర్మన్‌గా విశ్వనాథరావు



విశ్వనాథరావు

ఆసిఫాబాద్‌: జైనూర్‌ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌గా కుడిమెత విశ్వనాథరావు, వైస్‌ చైర్మన్‌గా బానోత్‌ జయవంత్‌ నియమితులయ్యారు. రాష్ట్రంలోని ఎనిమిది ఏఎంసీ పాలకవర్గాలను నియమిస్తూ మార్కెటింగ్‌ శాఖ కార్యదర్శి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. కొన్నినెలలుగా ఆసిఫాబాద్‌, జైనూర్‌ మార్కెట్‌ కమిటీ ఎంపిక విషయంలో అంతర్గత కలహాలు చోటుచేసుకుంటున్న విషయం తెలిసిందే. ఎట్టకేలకు జైనూర్‌ ఏఎంసీ పాలకవర్గాన్ని ప్రభుత్వం ప్రకటించింది. విశ్వనాథరావు ప్రస్తుతం కాంగ్రెస్‌ ఎస్టీ సెల్‌ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

నిధుల కటకట



నీల్వాయి ప్రాజెక్టు కుడికాలువ చెట్లపొదల తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌

- జిల్లా సాగునీటి శాఖలో బడ్జెట్‌ లేమి
- మరమ్మతులు, నిర్వహణకు ఇబ్బందులే..
- మూడు నెలలుగా వర్క్‌ ఇన్‌స్పెక్టర్లకు జీతాల్లేవ్‌
- ఎల్‌వోసీ విడుదల కాక సిబ్బంది అష్టకష్టాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సాగునీటి పారుదల సర్కిల్‌లో నిధుల కటకట వెంటాడుతోంది. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులతోపాటు ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న చెరువులు, కుంటలు, కాలువలు, గేట్ల మరమ్మతులకు కనీస నిధులు విడుదల కాని పరిస్థితి నెలకొంది. మంచిర్యాల సర్కిల్‌ పరిధిలో గత కొంతకాలంగా తాత్కాలిక పనుల కోసం బడ్జెట్‌ విడుదల కావడం లేదు. దీంతో తాత్కాలికంగా రైతులు, స్థానిక ప్రజాప్రతినిధుల సాయంతో ఏవైనా సమస్యలు ఉంటే పూర్తి చేస్తున్నారు. అత్యవసరం ఉన్న చోట మాత్రమే నిధులు సర్దుబాటు చేస్తున్నారు. చెరువులపై చేపట్టిన మినీ ట్యాంక్‌బండ్‌లు, అభివృద్ధి చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ఇప్పటివరకు చెల్లింపులు కాక కాంట్రాక్టర్లు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. రూ.కోట్లలో బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఈ వానాకాలంలో మంచిర్యాల జిల్లా పరిధిలో చెరువులు, కుంటల తూములు, కట్టలు, కాలువల తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.11.07 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికీ ఆ నిధులు సైతం విడుదల కాలేదు. దీంతో దెబ్బతిన్న తూముల కాలువలను నామమాత్రంగా మరమ్మతు చేశారు. ఇక తాత్కాలికంగా ఏ పనులైనా లష్కర్లు, వర్క్‌ ఇన్‌స్పెక్టర్లతో పూర్తి చేయిస్తున్నారు. నిధులు విడుదల కాకపోవడంతో స్థానికంగా ఉన్న ఏఈలే సొంతంగా తమ జేబుల్లో నుంచి డబ్బులు ఖర్చు చేస్తున్నారు. తర్వాత బిల్లుల చెల్లింపుల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది.

వర్క్‌ ఇన్‌స్పెక్టర్లకు జీతాల్లేవ్‌..

మంచిర్యాల సర్కిల్‌ పరిధిలో బెల్లంపల్లి, కాగజ్‌నగర్‌ సర్కిళ్లుగా ఉన్న కుమురంభీం, మంచిర్యాల జిల్లాల్లో 40మంది వర్క్‌ ఇన్‌స్పెక్టర్లు పని చేస్తున్నారు. వీరితోపాటు మరో 28మంది స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్‌ కార్యాలయ పరిధి భూ సేకరణ విభాగంలో పని చేస్తున్నారు. మొత్తం 68మందికి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2.15కోట్లు జీతాలు చెల్లించాలి. ప్రభుత్వం రూ.90లక్షలకే ఎల్‌వోసీ(లెటర్‌ ఆఫ్‌ క్రెడిట్‌) ఇచ్చింది. ఇంకా రూ.1.25కోట్లు చెల్లించాల్సి ఉంది. మరోవైపు గత మూడు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి ఏపీలో హౌసింగ్‌ కార్పొరేషన్‌లో పని చేసిన సిబ్బంది తెలంగాణ వచ్చాక ఆ శాఖను ఎత్తి వేయడంతో వారందరినీ పలు శాఖల్లో సర్దుబాటు చేశారు. అందులో కొందరు సిబ్బంది ప్రస్తుతం సాగునీటి శాఖలో పని చేస్తున్నారు. సాగునీటి వనరుల రక్షణ, పర్యవేక్షణ, మరమ్మతులు, వానాకాలంలో నీటి నిల్వలు, ప్రవాహం వంటి వాటిపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వివరాలు ఇస్తారు. ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తు పరిశీలనలోనూ సాగునీటి భూములు ఉన్నాయా? లేవా? అనే ధ్రువీకరణ కోసం క్షేత్రస్థాయిలో పని చేస్తున్నారు. కానీ ఈ సిబ్బందికి వేతనం చెల్లింపుల్లో జాప్యం జరగడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దసరా, దీపావళి పండుగలకు కూడా వేతనాలు లేక కుటుంబ పోషణకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాగునీటిశాఖలో పని చేసే అవుట్‌ సోర్సింగ్‌ సిబ్బంది హాజరు చేసి సంబంధిత నెల వారీగా ఏఈ, డీఈలు వేతనం చెల్లింపులకు ఉన్నతాధికారులకు నివేదించాలి. గత సెప్టెంబర్‌లో జీతాల విడుదల కోసం లేఖ రాసినప్పటికీ ఇప్పటికీ స్పందన లేదు. ప్రభుత్వం ఎల్‌వోసీ ఇవ్వడంలో జాప్యం జరుగుతుండడంతో సిబ్బంది కష్టాలు పడుతున్నారు.

సీఈగా ఇన్‌చార్జీలు

సాగునీటి పారుదల శాఖలో మంచిర్యాల, ఆసిఫాబాద్‌ జిల్లాలకు చీఫ్‌ ఇంజనీర్‌(సీఈ)గా గత కొంతకాలంగా ఇన్‌చార్జీలతోనే వెళ్లదీయాల్సి వస్తోంది. ఇటీవల ఇన్‌చార్జి సీఈ సైతం రిటైర్డ్‌ అయ్యారు. మరో అధికారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో పర్యవేక్షణ కొరవడుతోంది. ప్రస్తుతం సాగునీటి శాఖ పరిధిలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదు. గతంలో చేసిన పనులకు నిధుల చెల్లింపులు నిలిచిపోవడంతో చాలా ఏజెన్సీలకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. సాగునీటి వనరుల వృద్ధి కోసం క్షేత్రస్థాయిలో చిన్న పనులు తప్ప ఎలాంటి అభివృద్ధి పనులు సాగడం లేదు.

ఒక్కొక్కరిని పిలిచి.. ఆరా తీసి

- వాంకిడి ఆశ్రమ పాఠశాలలో అదనపు కలెక్టర్‌ విచారణ



పాఠశాలలో విచారణ చేపడుతున్న అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి, అధికారులు

వాంకిడి(ఆసిఫాబాద్‌): వాంకిడి మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినుల అస్వస్థతకు కారణాలు గుర్తించేందుకు ఉన్నతాధికారుల విచారణ కొనసాగుతోంది. సోమవారం ఆర్డీవో లోకేశ్వర్‌రావు ఆధ్వర్యంలో వివరాలు సేకరించగా.. మంగళవారం అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి సమక్షంలో విచారణ కొనసాగింది. అటెండర్లు, వంట సిబ్బంది, ఏఎన్‌ఎం, ఉపాధ్యాయులను ఒక్కొక్కరిని పిలిచి వివరాలు నమోదు చేసుకున్నారు. అస్వస్థతకు గురైన 64 మంది విద్యార్థినుల్లో 63 మంది కోలుకున్నారు. తొమ్మిదో తరగతి చదువుతున్న శైలజ మొదట స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం ఆర్‌ఎంపీ వద్ద కూడా చికిత్స తీసుకున్నట్లు తెలియడంతో ల్యాబ్‌ టెక్నీషియన్‌, మెడికల్‌ నిర్వాహకుడిని విచారించారు. సుమారు రెండుగంటలపాటు పాఠశాలలో విచారణ జరిపిన అనంతరం అధికారులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ రికార్డులు పరిశీలించారు. బాలికలు ఆస్పత్రిలో ఎప్పుడు చేరారు.. ఎన్ని రోజులు చికిత్స పొందారు.. అనే కోణంలో విచారించినట్లు డీఎంహెచ్‌వో సీతారాం తెలిపారు. ల్యాబ్‌ రిపోర్టుల్లో ఆహార పదార్థాలు కూడా కలుషితం కాలేదని అధికారులు చెబుతుండగా.. అస్వస్థతకు కారణాలపై మాత్రం స్పష్టత రావడం లేదు. ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీటీడీవో రమాదేవి, తహసీల్దార్‌ రియాజ్‌ అలీ, మండల ప్రత్యేకాధికారి రాథోడ్‌ బిక్కు, ఎంపీడీవో ప్రవీణ్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ విషమంగా శైలజ ఆరోగ్యం

నిమ్స్‌లో చికిత్స పొందుతున్న శైలజ ఆరోగ్య పరిస్థితి మళ్లీ విషమంగా మారింది. మంచిర్యాలలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గత వారం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. డయాలసిస్‌ అనంతరం కొంత కోలుకోగా మంగళవారం మళ్లీ విషమించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉదయం నాలుగు గంటల నుంచి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. కాగా ఆశ్రమ పాఠశాల వద్ద సీఐ సత్యనారాయణ, ఎస్సై ప్రశాంత్‌ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

హెచ్‌ఎం, సిబ్బందిపై బదిలీ వేటు

ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు అస్వస్థత గురైన ఘటనపై బాధ్యులను చేస్తూ హెచ్‌ఎం శ్రీనివాస్‌ సహా మరో నలుగురు సిబ్బందిని బదిలీ చేస్తూ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారని డీటీడీవో రమాదేవి తెలిపారు. కలెక్టర్‌ నియమించిన విచారణ కమిటీ నివేదిక మేరకు హెచ్‌ఎం శ్రీనివాస్‌ను కాగజ్‌నగర్‌కు బదిలీ చేయగా.. ఏఎన్‌ఎం సెవంత, కుక్‌ హరికిషన్‌, వర్కర్‌ కమలను బంబార ఆశ్రమ పాఠశాలకు, మరో వర్కర్‌ పెంటయ్యను పెంచికల్‌పేట్‌ మండలం కమ్మర్‌గాంకు బదిలీ చేసినట్లు డీటీడీవో వెల్లడించారు.

నష్టాల్లో భూగర్భ గనులు

- ఒక్కో టన్నుకు రూ.5,540 నష్టం
- ఖర్చు తగ్గించుకుని.. యంత్రాల వినియోగం పెంపుపై దృష్టి

భూగర్భ గనుల్లో ఉత్పత్తి, ఖర్చు, నష్టాలు ఒక్కో టన్నుకు రూ.లలో

సంవత్సరం	ఉత్పత్తి ఖర్చు	అమ్మకం ధర	నష్టం
2019–20	5,413	3,135	2,325
2020–21	9,155	2,935	6,220
2021–22	8,210	3,300	4,910
2022–23	7,451	4,088	3,363
2023–24	9,368	4,658	4,740
2024–25	10,394	4,854	5,540



భూగర్భంలో ఎస్‌డీఎల్‌ ద్వారా బొగ్గు తీస్తున్న దృశ్యం

శ్రీరాంపూర్‌: సింగరేణిలో భూగర్భ గనులన్నీ నష్టాల్లోనే నడుస్తున్నాయి. ఓసీపీల్లో లాభాలు వస్తున్నాయి. ఓసీపీలు, ఎస్టీపీపీలో వచ్చే లాభాలతో భూగర్భ గనుల్లో నష్టాలను భర్తీ చేస్తున్నారు. అయినప్పటికీ సింగరేణి సంస్థ లాభాలు గడిస్తోంది. సింగరేణిలో ఓ వైపు నష్టాలు, మరోవైపు లాభాలూ ఉంటాయి. కంపెనీలో 22భూగర్భ గనులు, 16 ఓసీపీలు ఉన్నాయి. భూగర్భ గనుల్లో కూడా లాభాలు వస్తే సంస్థ మరింత లాభాలు వస్తాయని అనుకున్నా.. ప్రస్తుత జియోలాజికల్‌ కండీషన్స్‌, కోల్‌మైనింగ్‌ నిబంధనలతో సాధ్యం కాదు. గనులన్నీ 300మీటర్ల లోతుల్లోకి వెళ్లడంతో ఉత్పత్తి ఖర్చు రోజు రోజుకు పెరుగుతూ పోతుంది. భూగర్భ గనుల్లో లాభాలు రావడం అసాధ్యమని, కానీ నష్టాలను తగ్గించుకునే అవకాశం ఉందని, దీనిపైనే దృష్టి సారిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. ఇటీవల కంపెనీ ఆర్థిక స్థితి గనులపై 'ఉజ్వల సింగరేణి.. ఉద్యోగుల పాత్ర' పేరిట అవగాహన కల్పించారు. కానీ ఇంకా ఉద్యోగుల్లో చైతన్యం నింపి భూగర్భ గనుల్లో నష్టాలు తగ్గించడానికి యాజమాన్యం నిత్యం కృషి చేస్తూనే ఉంది.

తగ్గించుకునే చర్యలు

భూగర్భ గనుల్లో నష్టాలు తగ్గించుకునే చర్యలు చేపట్టారు. ఇందుకోసం ఎస్‌డీఎల్‌, ఎల్‌హెచ్‌డీలు, కంటిన్యూయస్‌ మైనర్లు వినియోగించే సమయం మరింత పెంచేలా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఒక ఎస్‌డీఎల్‌ యంత్రం ద్వారా 102 టన్నులు తీస్తున్నారు. రోజుకు 6.45 గంటలు దీన్ని వినియోగిస్తున్నారు. దీనిని 8.30 గంటలపాటు వినియోగిస్తే కనీసం రోజుకు 132 టన్నుల బొగ్గు ఎస్‌డీఎల్‌ ద్వారా పెంచుకోవచ్చని అధికారులు ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతోపాటు కొన్ని పనులు కూడా ఇకపై అవుట్‌ సోర్సింగ్‌ చేయాలనే ఆలోచనలో సింగరేణి ఉంది. ఇప్పటికే మేషన్‌ పనులు, రూఫ్‌ బోల్టింగ్‌ యంత్రాలను ప్రైవేటు కాంట్రాక్టర్లతో చేయిస్తున్న సింగరేణి భవిష్యత్‌లో ఎస్‌డీఎల్‌ యంత్రాలను కూడా అవుట్‌సోర్సింగ్‌ చేసినా ఆశ్చర్యపడాల్సిన పనిలేదని కార్మిక సంఘాల నేతలు పేర్కొంటున్నారు. ఉన్న భూగర్భగనుల జీవిత కాలం దగ్గపడుతున్న కొద్దీ వాటిని మూసివేయడం తప్ప ఇంకా అందులో మిగిలి ఉన్న నిల్వల కోసం కొత్తగా ప్రతిపాదనలు పెట్టి అనుమతులు తీసుకుని మరింత జీవిత కాలం పొడగించే ఆలోచన ఇక నుంచి చేయవద్దనే చర్చ కూడా ఉన్నత అధికారుల్లో ఉంది. ఎన్ని వీలైతే అన్ని కొత్త ఓసీపీలకే మొగ్గు చూపబోతున్నారు.

ఐదేళ్లలో రూ.13,093 కోట్లు నష్టం

సింగరేణి భూగర్భ గనుల్లో గత ఐదేళ్లలో రూ.13,093 కోట్ల నష్టం వచ్చింది. టన్ను బొగ్గు ఉత్పత్తికి వేతనాలు, యంత్రాల ఖర్చులు అన్ని కలిపి రూ.10,394 వ్యయం అవుతుంది. ఈ టన్ను విక్రయిస్తే రూ.4,854 వస్తుంది. అంటే టన్ను బొగ్గు భూగర్భంలో నుంచి తీస్తే రూ.5,540 నష్టం చవిచూడాల్సి వస్తోంది. గనులు లోతుల్లోకి వెళ్లడం ప్రధాన కారణంగా పేర్కొంటున్నారు. అమ్మకం ధర పెంచుకునే అవకాశం సింగరేణికి లేదు. ప్రభుత్వ రంగ సంస్థలన్నీ కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ధరల మేరకు విక్రయించాలి. కానీ ప్రైవేటు బొగ్గు సంస్థలకు ఆ నిబంధన లేదు. దీంతో వారు సింగరేణి కంటే తక్కువకు అమ్ముతుండడంతో కంపెనీకి మార్కెట్‌ పోటీ తీవ్రమైంది. ధర పెంచుకోవడం సాధ్యం కాదు కాబట్టి వ్యయం తగ్గించుకోవడమే కంపెనీ ముందున్న లక్ష్యం.

అలంకారప్రాయమేనా..!?

రామకృష్ణాపూర్ పట్టణంలో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు అలంకార ప్రాయంగానే దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇళ్ల నిర్మాణం చేపట్టినప్పటికీ లబ్ధిదారులకు అందించడంలోని వైఫల్యమే ఈ దుస్థితికి కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇళ్ల నిర్మాణం పూర్తయి అర్హుల జాబితా సిద్ధం చేసినా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టడం లేదు. పర్యావసానంగా అర్హుల ఎంపిక జాబితా కూడా పనికి రాక.. అసలు లబ్ధిదారులకు అవి పంపిణీ కాక నేడు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. గత పాలకులేమో కానీ ప్రస్తుత ప్రభుత్వమైనా కనీసం ఈ ఇళ్లపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో కోట్లాది రూపాయలు వృథా అయ్యే పరిస్థితి నెలకొందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- ఎటూ తేలకుండా పోతున్న 286 డబుల్ బెడ్ రూం ఇళ్లు
- రూ.15.16 కోట్లు వెచ్చించి నిర్మించినా ఫలితం శూన్యం
- అర్హుల జాబితా ప్రకటించినా పూర్తికాని లబ్ధిదారుల ఎంపిక
- శిథిలావస్థకు చేరుకుంటున్న ఇళ్లు


ఆర్‌కేపీలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు


ధ్వంసమైన కిటికీ అద్దాలు

రామకృష్ణాపూర్(చెన్నూర్): పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.15.16 కోట్లతో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం చేపట్టింది. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ హయాంలో 286 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇళ్ల నిర్మాణాలు కూడా పూర్తయ్యాయి. కేవలం ఇంటర్నల్ రోడ్ల నిర్మాణం, లైటింగ్, తదితర చిన్నపాటి పనులు చేపడితే ఈ ప్రక్రియ మొత్తం పూర్తి కానుంది.

అర్హుల జాబితా ప్రకటించినా...

వాస్తవానికి రామకృష్ణాపూర్ పట్టణంలో చాలామంది నిరుపేదలున్నారు. అప్పట్లో సింగరేణి ఆధీనంలో ప్రభుత్వ స్థలాలు ఉండటంతో భయంభయంగా కొందరు సొంతంగా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. పట్టాలు లేక పరేషాన్ అయిన సందర్భాలూ ఉన్నాయి. ఎట్టకేలకూ గత ప్రజాప్రతినిధుల చొరవ.. సింగరేణి యాజమాన్యం నిర్ణయంతో అధికారికంగా పట్టాలు జారీ చేయడంతో ఈ సమస్య గాడినపడింది. ఇదే సమయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టడంతో తమకు ఇల్లు వస్తుందన్న ఆశతో చాలామంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 286 ఇళ్లకు వేలాది దరఖాస్తులు రాగా ఎట్టకేలకూ అర్హులైన వారిని ఎంపిక చేసి జాబితా సైతం మున్సిపల్ కార్యాలయంలో నోటీస్ బోర్డులో డిస్‌ప్లే చేశారు. అనివార్యంగా సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఇళ్ల పంపిణీ ప్రక్రియ పడకేసింది.

శిథిలావస్థకు డబుల్ ఇళ్లు..

డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం జరిగి దాదాపు రెండేళ్లు పూర్తి కావస్తున్నా పంపిణీ ప్రక్రియ చేపట్టకపోవటం విమర్శలకు దారితీస్తోంది. రూ.15.16 కోట్ల ప్రజాధనం వృథా కానుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తయి వృథాగా ఉంటుండడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. గతంలోని ఇందిరమ్మ ఇళ్ల పథకం నిలిపివేసి వాటి స్థానంలో డబుల్ బెడ్ రూం ఇళ్లు అందించాలన్న సంకల్పం మట్టికరుచుకుపోవడం విమర్శలకు ప్రధాన కారణం. ప్రస్తుతం అదే ఇందిరమ్మ ఇళ్ల పథకం పునరావృతం చేయడానికి ప్రస్తుత ప్రభుత్వం సన్నాహాలు మొదలు పెట్టినా అసలు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఏం చేస్తారనే దానిపై స్పష్టత కరువైంది. ఇప్పటికైనా నిరుపేద కుటుంబాలకు చెందిన వారిని పరిగణలోకి తీసుకుని అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. నిలువ నీడ కల్పించాలని విన్నవిస్తున్నారు. అయితే ప్రభుత్వ స్పందనపైనే ఈ ఇళ్ల అంశం ఆధారపడి ఉందనే అభిప్రాయాలు సైతం వ్యక్తమవుతున్నాయి.

క్లుప్తంగా

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

తాండూర్: ఇంటి పరిసరాల్లో గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. తాండూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బారేవాడకు చెందిన ఇడిదినేని నాగయ్య తన ఇంటి సమీపంలో గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు అతని ఇంటికి వెళ్లి పరిసరాల్లో వెతకగా గంజాయి మొక్కలు కనిపించాయి. మొక్కలు స్వాధీనం చేసుకుని నిందితునిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ


చోరీకి గురైన హోండా యాక్టీవా

లక్ష్మణచాంద(నిర్మల్): మండలంలోని కనకాపూర్‌లో హోండా యాక్టీవా (టీఎస్18జి 0462) చోరీకి గురైనట్లు ఎస్సై సుమలత తెలిపారు. గ్రామానికి చెందిన రాజేందర్ ఎప్పటిలాగే ఇంటి ముందు తన స్కూటీని పార్క్ చేశారు. మంగళవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు వాహనాన్ని అపహరించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేషన్‌బియ్యం తరలింపుపై కేసు నమోదు

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని గూడెం సమీపంలో సోమవారం రాత్రి పట్టుబడిన రేషన్ బియ్యం తరలింపుపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. నంబాల గ్రామానికి చెందిన మధుకర్ ప్రభుత్వం పంపిణీ చేసిన రేషన్ బియ్యాన్ని వినియోగదారుల నుంచి కొనుగోలు చేసి అశోక్ లేలాండ్ వాహనంలో అక్రమంగా తరలిస్తుండగా గూడెం సమీపంలో పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అందులో సుమారు 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభించాయని, వాటి విలువ రూ.40వేలు ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

'జిత్తుల మారి' చిక్కింది


కెమెరాకు చిక్కిన నక్క

జన్నారం(ఖానాపూర్): కవ్వాల్ టైగర్‌జోన్ వివిధ రకాల వన్యప్రాణులకు ఆవాసం. పలు ప్రాంతాలలో రకరకాల వన్యప్రాణులు నివాసం ఉంటున్నాయి. ఇందులో అరుదుగా కనిపించేవి నక్కలు. అటవీశాఖ అధికారులు అమర్చిన కెమెరాకు జిత్తుల మారి నక్క చిక్కింది.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

బెల్లంపల్లి: జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) అండర్-19 ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సెక్రెటరీ బి.బాబురావు వెల్లడించారు. ఈ నెల 9, 10 తేదీల్లో బెల్లంపల్లి కేంద్రంగా రాష్ట్రస్థాయి బాలబాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు త్వరలో మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనడానికి అర్హత సాధించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

బాలికల విభాగంలో...

టి.నేహాశ్రీ, ఎం.గంగోత్రి, జె.శ్రావ్య, ఎస్.మహేశ్వరి (నిజామాబాద్), ఆర్.అలేఖ్య, డి.సుమిత్రా, అభినయ, కె.కృష్ణ శ్రీ, ఎస్.సుహాత్రి (మెదక్), పి.అనిత, కేతావత్ త్రిష (మహబూబ్‌నగర్), జి.మన్యశ్రీ, ముప్పిడి అశ్రిత (వరంగల్), జె.గాయత్రి, ఏ.వర్షిణి (ఆదిలాబాద్), బి.వైష్ణవి (కరీంనగర్) ఎంపికయ్యారు. వీరితో పాటు కే.వేదశ్రీ (నల్గొండ), ఐ.నవనీత (మెదక్), ఎం.ప్రీతి (నిజామాబాద్)ను స్టాండ్‌బైగా ఎంపిక చేశారు.

బాలుర విభాగంలో...

రాజ్‌పుత్ వక్కీ, వడాయ్ గోపాల్, జె.ప్రభాస్, బి.సిద్ధార్థ (ఆదిలాబాద్), రమావత్ దేవీప్రసాద్, జాదవ్ కిషన్, హలవత్ జగన్, జారుపుల తరుణ్ (మెదక్), యు.రామ్‌చరణ్, జి.శ్రీచేతన్ (మహబూబ్‌నగర్), ఐ.అశ్వజ్, జి.ప్రసాద్ (నిజామాబాద్), పి.సాయి (నల్గొండ), కనకం గణేశ్ (వరంగల్), ఆర్. రామ్‌చరణ్ (రంగారెడ్డి), కె.మల్లికార్జున్ (హైదరాబాద్)ను ఎంపిక చేశారు. వీరితో పాటు పి.కళ్యాణ్‌రాజు (ఖమ్మం), ఎం.మణికంఠ(ఆదిలాబాద్), జనగాం సాయిచరణ్ (మెదక్)ను స్టాండ్‌బైగా ఎంపిక చేసినట్లు బాబురావు ప్రకటించారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురి రిమాండ్


పోలీసుల అదుపులో నిందితులు


ఆదిలాబాద్‌రూరల్: హత్యాయత్నం కేసులో ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్‌రూరల్ ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చాందా సమీపంలో గల రుద్రదాబాలో ఈ నెల 10న రాత్రి శాంతినగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ మోయిన్‌పై తిర్పెల్లికి చెందిన శంషీర్‌ఖాన్, శన్నుఖాన్, మహ్మద్ అక్బర్ కత్తితో దాడికి పాల్పడ్డారు. బాధితునికి తీవ్ర గాయాలయ్యాయి. శంషీర్ ఖాన్‌పై ఇదివరకు పది కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. గంజాయి, హత్యాయత్నం తదితర కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు చెప్పారు. రౌడీషీట్ కూడా ఉందన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య


సతీష్(ఫైల్)

లక్ష్మణచాంద(నిర్మల్): ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సుమలత తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన తలారి సతీష్ (22) రెండేళ్ల క్రితం దుబాయ్‌కి వెళ్లి ఇటీవలే స్వగ్రామానికి తిరిగివచ్చాడు. ఇంటి వద్ద వ్యవసాయ పనులు చేసుకుంటూ తల్లి సాయవ్వ, చెల్లి వాణితో కలిసి ఉంటున్నాడు. దుబాయ్ వెళ్లేందుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక సోమవారం రాత్రి ఇంటి ముందున్న పోల్‌కు ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం పోలీసులకు సమాచారం ఇచ్చారు. తల్లి సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బస్సులోంచి దూకి మహిళ ఆత్మహత్యాయత్నం


గాయాలపాలైన గంగామణి

ముధోల్: మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాల సమీపంలో మంగళవారం ఓ మహిళ నడుస్తున్న బస్సులోంచి దూకి ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు నిజామాబాద్‌కు చెందిన గంగామణి తన భర్త గంగాధర్‌తో కలిసి తన అమ్మమ్మ ఊరైన దేగానికి వచ్చింది. తిరుగు ప్రయాణంలో దేగాం నుండి నిజామాబాద్‌కు వెళ్తుండగా బస్సులోంచి దూకి ఆత్మహత్య చేసుకోబోయింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును నెమ్మదిగా తీసుకెళ్లడంతో ప్రమాదం తప్పింది. అంతకు ముందు భార్య భర్తలు గొడవపడ్డట్లు గంగాధర్ తెలిపారు. ప్రయాణికులు 108కు సమాచారం అందించడంతో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

పురుగుల మందు తాగి ఒకరు బలవన్మరణం

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): మద్యం మత్తులో పురుగుల మందు ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కామాయిపేట పంచాయితీ పరిధిలోని ఆలిగూడకు చెందిన కోట్నాక్ చిన్ను (40) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం సాయంత్రం తన పంటచేనులో మద్యం మత్తులో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం పంట చేనుకు వెళ్లిచూడగా శవమై కనిపించాడు. మృతునికి భార్య లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని యువకుడు..

తలమడుగు: మద్యం తాగొద్దని కుటుంబ సభ్యులు మందలించినందుకు పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై అంజమ్మ తెలిపిన వివరాల మేరకు మండలంలోని పల్లి (బి)కి చెందిన కుమ్ర శివకాంత్ (19) ఈనెల 7న ఉదయాన్నే మద్యం సేవించి ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన యువకుడు ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రాళ్లపేటకు చెందిన ఒరుగంటి సతీశ్(25) టాటా ఏసీ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 11న ఇంట్లో నుంచి వెళ్లిపోయి మంగళవారం వరకు కూడా ఇంటికి రాలేదు. సతీశ్ భార్య రమ్య తన భర్తకు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్చాఫ్ వస్తుందన్నారు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాములు తెలిపారు.

విద్యార్థిని మృతికి సంతాపం


నివాళులర్పిస్తున్న వీసీ గోవర్ధన్

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో పీయూసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పూరి స్వాతిప్రియ మృతికి మంగళవారం సంతాపం ప్రకటించారు. క్యాంపస్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ విద్యార్థిని చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థిని అకాల మృతి చెందడం బాధాకరమన్నారు. విద్యార్థి కుటుంబానికి వర్సిటీ తరపున ప్రగాఢ సంతాపం తెలిపారు. అధ్యాపకులు విద్యార్థులతో కలిసి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

అవినీతి కేసులో జైలుశిక్ష, జరిమానా

లక్సెట్టిపేట(మంచిర్యాల): లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఓ ఉద్యోగికి కరీంనగర్ ఏసీబీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కుమార్ వివేక్ జైలుశిక్ష, జరిమానా విధించారు. 2013లో పట్టణంలో డిప్యూటీ కమర్షియల్ ట్యాక్స్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న తొగరి పోచయ్య ముత్యంపల్లికి చెందిన ఫర్టిలైజర్ దుకాణం యజమాని సురేందర్ వద్ద రూ.4వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకుని కేసు నమోదు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిషోర్ కుమార్ సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో మంగళవారం నిందితునికి అండర్ సెక్షన్ 7 ప్రకారం మూడేళ్ల జైలు, రూ.3వేల జరిమానా, అండర్ సెక్షన్ 13(1) (ఛీ)ట/ఠీ 13 (2) ప్రకారం నాలుగేళ్ల జైలు, రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

ఒకరికి ఏడాది జైలు

నర్సాపూర్(జి): ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ఒక మహిళ మృతికి కారకుడైన చిట్టి పెద్ద ముత్యంకు ఏడాది సాధారణ జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ కోర్టు మంగళవారం తీర్పు నిచ్చినట్లు ఎస్సై హన్మాండ్లు, కోర్టు డ్యూటీ ఆఫీసర్ మహేందర్ సింగ్ తెలిపారు. 2016 నవంబర్ 11న లక్ష్మణచాంద మండలం తిర్పెల్లికి చెందిన చిట్టి పెద్ద ముత్యం బైక్‌పై వెళ్తూ బతుకమ్మ ఆడుతున్న మహిళలను ఢీకొట్టాడు. ఘటనలో దుర్గి ప్రేమల, దోడ్ల ప్రేమల అనే ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ దుర్గి ప్రేమల మృతి చెందింది. రాంపూర్ గ్రామానికి చెందిన రావణ భాస్కర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై రాం నర్సింహారెడ్డి కేసు నమోదు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.దేవేందర్ 10 మంది సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఆర్.అజయ్ కుమార్ మంగళవారం పైవిధంగా తీర్పు వెలువరించారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: ఇద్దరు మట్కా నిర్వాహకులను మంగళవారం అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని డీఈవో కార్యాలయ సమీపంలో శాంతినగర్‌కు చెందిన షేక్ ఖయ్యుం, బంగారిగూడకు చెందిన జాదవ్ సంజీవ్ మట్కా నిర్వహిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.1,100 నగదుతో పాటు సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

అందరూ ఉన్నా.. అనాథలా

- కుటుంబ సభ్యులతో కలిసి ఉండలేక..
- మందమర్రిలో ఒంటరిగా...
- అనాథాశ్రమంలో చేర్పించాలని వేడుకోలు..


తిరుపతిరెడ్డి

మందమర్రిరూరల్: కన్నబిడ్డలతో పాటు కట్టుకున్న భార్య కూడా శత్రువులా మారి ఇంటి పెద్దను ఇబ్బందులు పెడుతుండడంతో కుటుంబంతో కలిసి ఉండలేక చనిపోవడం చేతగాక అందరూ ఉన్నా అనాథలా జీవిస్తున్నాడు ఓ వృద్ధుడు. మందమర్రి పట్టణంలోని రామకృష్ణాపూర్ రోడ్డు పాలచెట్టు సమీపంలో గల బతుకమ్మ ఘాట్‌కు చెందిన పాముకుంట్ల తిరుపతిరెడ్డి(90)కి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కరీంనగర్ జిల్లా వావిలాల నుంచి 45 ఏళ్ల క్రితం ఉపాధి నిమిత్తం మందమర్రికి వచ్చి ఎడ్లబండిపై సామగ్రి చేరవేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పైసాపైసా కూడబెట్టి బతుకమ్మ ఘాట్ పక్కన ఐదు గుంటల స్థలం కొనుగోలు చేసి అందులో ఇల్లు కట్టాడు. తన పేరిట ఉన్న రెండెకరాల భూమిని అమ్మి కూతురు పెళ్లి వైభవంగా జరిపించాడు. ఇటీవల మందమర్రిలోని ఇంటిని ఓ ప్రైవేట్ డాక్టర్‌కు విక్రయించి జీవనోపాధి కోసం హైదరాబాద్ వెళ్దామని కుమారుడు చెప్పడంతో జగద్గిరిగుట్ట ఏరియాలో ఓ ఇంటిని కొనుగోలు చేసి అక్కడికి మకాం మార్చారు. కుటుంబ సభ్యులతో కొంతకాలం బాగానే కలిసి ఉన్నారు. ఇటీవల కుటుంబ సభ్యుల వేధింపులు ఎక్కువ కావడంతో వారితో ఉండలేక తిరిగి మందమర్రికి వచ్చి ఒంటరిగా జీవిస్తున్నాడు.

ఎముకలు కొరికే చలిలోనే జీవనం...

రెండున్నర నెలల క్రితం జగద్గిరిగుట్ట నుంచి మందమర్రికి వచ్చిన తిరుపతిరెడ్డి స్థానిక ఎంవీటీసీ పక్కనగల ఖాళీ స్థలంలో ఎముకలు కొరికే చలిలోనే ఉంటున్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి ఉండడం కంటే చనిపోవడం మేలని, తనను ఎవరైనా ఏదైనా వృద్ధాశ్రమంలోనే ఉంచాలని తనను కలిసిన ప్రతీ ఒక్కరిని వేడుకుంటున్నాడు.

కార్గో సేవలు సద్వినియోగం చేసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న కార్గో సిబ్బంది

ఆదిలాబాద్: ఆర్టీసీ కార్గో ఆధ్వర్యంలో హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో ప్రారంభించిన డోర్ డెలివరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రీజియన్ కార్గో ఆఫీసర్ బి.పాల్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం కార్గో ఆధ్వర్యంలో ప్రజా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణవాసులు, వ్యాపారులకు కార్గో అందిస్తున్న డోర్ డెలివరీ సేవలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతనంగా ప్రారంభించిన సర్వీస్‌తో ఇంటి వద్దకే పార్శిల్లను అందజేయడం జరుగుతుందన్నారు. జంట నగరాల పరిధిలోని 31 ఆర్టీసీ కార్గో కౌంటర్లకు బుకింగ్ చేసుకునే సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, వ్యాపార సంస్థలకు డోర్ డెలివరీ ద్వారా తమ సరుకులను పంపించే వీలు కలుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీజీ రెడ్డి, రీజినల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సాయన్న, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ అన్సార్, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థిని తల్లిపై ఎస్పీకి ఫిర్యాదు


ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న పోలీస్ అధికారుల సంఘ సభ్యులు

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని స్వాతిప్రియ తల్లి ఉజ్వలపై చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు అధికారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఎస్పీ జానకీషర్మిలకు ఫిర్యాదు చేశారు. విద్యార్థిని ఆత్మహత్య సమాచారం రావడంతో బాసర ఎస్సై గణేష్ అక్కడికి చేరుకుని వెంటనే భైంసా ఆస్పత్రికి తరలించారని పేర్కొన్నారు. అప్పటికే విద్యార్థిని మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారని, వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఆరు పేజీల లేఖ రాసిందని తెలిపారు. భైంసా ఆస్పత్రి వద్ద విధి నిర్వహణలో ఉన్న ఎస్సై గణేశ్ కాలర్ పట్టుకుని తన కూతురును చంపేశారని ఉజ్వల నిలదీసిందని తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న ఎస్సై కాలర్ పట్టుకోవడమే కాకుండా నిరాధార ఆరోపణలు చేసిన ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీపై చర్య తీసుకోవాలి

నిర్మల్‌టౌన్: ఏబీవీపీ కార్యకర్తలపై దాడిచేసి గాయపర్చిన ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ సిబ్బందిపై చర్య తీసుకోవాలని ఏబీవీపీ కార్యకర్తలు ఎస్పీ జానకీ షర్మిలకు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. విద్యార్థిని మృతిపై అనుమానాలు ఉన్నాయని, 11 నెలలుగా చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న రాకేశ్, సెక్యూరిటీ ఏజెన్సీ, లేడీ వార్డెన్ కారణంగానే ఆత్మహత్య చేసుకుంటున్నారని ఎస్పీకి తెలిపారు. విద్యార్థిని ఆత్మహత్యపై ఏబీవీపీ కార్యకర్తలు శాంతియుతంగా నిరసన తెలుపుతుండగా, సెక్యూరిటీ సిబ్బంది కర్రలతో దాడి చేశారని పేర్కొన్నారు. బాధ్యులపై కేసు నమోదుచేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇద్దరు సెక్యూరిటీ గార్డుల అరెస్ట్

బాసర: బాసర ట్రిపుల్‌ఐటీ ప్రధాన గేటు వద్ద విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సెక్యూరిటీ సిబ్బందిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. సోమవారం విద్యార్థిని మృతి ఘటనపై నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులపై సెక్యూరిటీ సిబ్బంది దాడి చేయడంతో గాయాలయ్యాయి. దీంతో సెక్యూరిటీ సిబ్బంది శ్రీనివాస్, దత్తహరిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వర్క్‌ఫ్రమ్ హోం పేరుతో సైబర్ మోసం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సరిత వద్ద వర్క్ ఫ్రమ్ హోం పేరుతో సైబర్ మోసగాళ్లు రూ.3 లక్షల 90వేలు కాజేసిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. సీఐ ప్రమోద్ రావు తెలిపిన వివరాల మేరకు సెప్టెంబర్ 9న సరిత తన ఇన్‌స్టాగామ్‌లో యాడ్ చూస్తుండగా వర్క్ ఫ్రమ్ హోం అని వచ్చింది. దీన్ని చూసిన బాధితురాలు వారిని సంప్రదించగా కంపెనీ నిబంధనల ప్రకారం వర్క్ ఫ్రమ్ హోంకు సంబంధించిన పనిని అప్పగించారు. ఇందుకు రూ.వెయ్యి కట్టమని కొంతపనిని అప్పగించారు. ఇందుకు అకౌంట్‌లో రూ.3,900 వేశారు. వాటిని తీసుకునేందుకు రూ. 5 వేలు కట్టమన్నారు. ఇలా తనుచేసిన టాస్క్‌లకు సంబంధించిన డబ్బులు అకౌంట్‌లో వేశారు. కానీ వాటిని డ్రా చేసుకునేందుకు కొంత అమౌంట్ డిపాజిట్ చేయాల్సి ఉంటుందని చెప్పడంతో పలు ధఫాలుగా రూ.3 లక్షల 90 వేలు చెల్లించింది. ఆతర్వాత వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో మోసపోయానని గ్రహించి సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నంబర్ 1930కు మంగళవారం ఫిర్యాదు చేసింది. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక


అంజలిని అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

గుడిహత్నూర్(బోథ్): మండలంలోని ఉమ్రి (బి) బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న కొడప అంజలి గత నెల 5న మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు పీడీ రామచంద్రం, హెచ్‌ఎం ఆడే రాజేశ్వర్ తెలిపారు. ఈ నెల 15న జమ్మూకశ్మీర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో విద్యార్థిని పాల్గొననున్నట్లు తెలిపారు. సదరు విద్యార్థిని మంగళవారం పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

పశువులను తరలిస్తున్న వాహనం పట్టివేత

నేరడిగొండ: అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పెట్రోలింగ్‌లో భాగంగా మంగళవారం కుప్టి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వైపు 25 ఎద్దులను అక్రమంగా తరలిస్తున్న కంటైనర్‌ను గుర్తించి పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.